క్లుప్తంగా

కొండముచ్చులు పట్టివేత



రేపల్లె: రేపల్లె పట్టణం ఓల్‌టౌన్‌లో తిరుగుతూ ప్రజలను, పశువులను ఇబ్బందులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న కొండముచ్చులను గురువారం బంధించి శ్రీశైలం అడవులకు తరలిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు తెలిపారు. గత 20రోజుల నుంచి ఓల్డ్‌టౌన్ ప్రాంతంలో కొండముచ్చులు సంచరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయన స్పందించి మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు ఆదేశాల మేరకు నెల్లూరు నుంచి ప్రత్యేకంగా కొండముచ్చులు పట్టే వారిని పిలిపించి.. వాటిని బోనులో బంధించి శ్రీశైలం అడవులకు తరలిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

విద్యార్థులకు మిషన్ వాత్సల్య పథకం

భట్టిప్రోలు: తల్లిదండ్రులు లేని విద్యార్థులకు మిషన్ వాత్సల్య పథకం ఒక వరమని ఎంపీడీవో ఎస్.వెంకటరమణ తెలిపారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన జెడ్పీ హైస్కూల్‌లో చదువుచున్న 6వ తరగతి విద్యార్థిని, సూరేపల్లి ఎంపీపీఎస్ (హెచ్‌ఈ)లో 4వ తరగతి విద్యార్థి మిషన్ వాత్సల్య పథకం పొందారు. వీరు ఈ పథకం కింద 6 నెలలకు గాను రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందుకోనున్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమణ వీరిని అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి నీలం దేవరాజు, సూరేపల్లి ఎంపీపీఎస్ హెచ్‌ఈ హెచ్‌ఎం పి.కిషోర్, విద్యార్థుల సంరక్షురాలు చిలుమూరి కుమారి పాల్గొన్నారు.

దేవాలయ ప్రాంగణంలో వంటశాలకు శంకుస్థాపన



అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడలోని శైవ క్షేత్రమైన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం వంటశాలకు శంకుస్థాపన నిర్వహించారు. స్థానికులు పాటిబండ్ల సుజాత జ్ఞాపకార్థం ఆమె భర్త శివశంకర గాంధీ వంటశాల ఏర్పాటుకు రూ.2.50 లక్షలు ఇచ్చినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో గోవాడ గ్రామ సర్పంచి మండవ విజయలక్ష్మి, రమేష్ కుమార్, శత ప్రతిష్ఠాచార్య ఆగమశాస్త్ర వేద బ్రాహ్మణులు స్వర్ణ శ్రీనివాసశర్మ, అర్చకులు పొన్నపల్లి సత్యనారాయణ, శివరామకృష్ణ, జొన్నలగడ్డ దివాకర మోహన్ పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లో కొలువైన శ్రీ సాయిబాబా మందిరం (ఆలయ) కమిటీ ఆధ్వర్యంలో గురువారం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. దాతలు పడమట వెంకట సాయికుమార్ (కోనేటిపురం), తోటకూర వెంకట సాయిరామ్ (పెరవలి), కురాళ రవి కుమర్ (భట్టిప్రోలు) సహకారంతో ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్ బాబు, నిర్వాహకులు పాల్గొన్నారు.

వీఆర్వో అభినందన కార్యక్రమం



భట్టిప్రోలు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బాపట్లలో జరిగిన వేడుకల్లో భట్టిప్రోలు మండలం వెల్లటూరు వీఆర్వో, ఇన్‌చార్జి ఆర్‌ఐగా పని చేస్తున్న పి.శివరామకృష్ణ సేవలకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళీ ప్రశంసా పత్రాన్ని అందించారు. గురువారం వెల్లటూరులో ఏపీసీపీ ఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ ఆధ్వర్యంలో శివరామకృష్ణను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మోటూరు వాసుదేవరావు, కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, పమిడిముక్కల వెంకట సుబ్బయ్య, పుల్లయ్య, గోగినేనిశేఖరం, ప్రసాద్, వాకా హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా

భట్టిప్రోలు: మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా విధిస్తున్నట్లు ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. భట్టిప్రోలులో మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురికి రూ.10 వేలు చొప్పున రూ.60 వేలను రేపల్లె పీజేసీజే కోర్టు జరిమానా విధించిందని ఆయన గురువారం పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించమని.. చట్టపరమైన చర్యలు తీసుకుని జరిమానా విధిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

జీతాలు పెంచాలని అంగన్‌వాడీల నిరసన

అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు ర్యాలీ



భట్టిప్రోలులో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు

భట్టిప్రోలు: అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు గురువారం భట్టిప్రోలులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక చావలి సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకురాలు బి.రమాదేవి ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన చేశారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని.. జీతాలు పెంచాలని.. గ్రాడ్యూట్ ఇవ్వాలని.. పలు యాప్‌లను ఒకే యాప్‌గా మార్చాలని.. సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయాలని వారు నిరసనలో కోరారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు పని చేయడం లేదని పేర్కొన్నారు. సమస్యలను త్వరితగతిన ప్రభుత్వం పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు గృహలక్ష్మి, సూర్యలక్ష్మి, మమత, వాణి, కాంతమ్మ, రత్నకుమారి, రూపారాణి, హెల్పర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత..

వేమూరు: ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌర అధ్యక్షులు బి.ఆగస్టీన్ డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సుశీలకు గురువారం తమ డిమాండ్లకు సంబంధించిన వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందికరమైన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా(బ్లాక్ డే) నిరసన దినంగా పాటిస్తున్నదని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పని చేయడం లేదన్నారు. లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్, ఓటీపీ వంటి వాటికి అంగన్‌వాడీలు గంటల సమయం వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. సరుకులు అన్నీ ఒకేసారి రావడంలేదన్నారు. నెట్‌వర్క్ సక్రమంగా లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని.. ప్రభుత్వం యూనియన్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పి.బసవమ్మ, నాయకులు ఎం.పద్మావతి, అన్నపూర్ణ, జి.అమల, సునీత, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు



బాపట్ల కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

బాపట్ల అర్బన్: అంగన్‌వాడీలకు ముఖ గుర్తింపు విధానాన్ని (ఎఫ్ఆర్ఎస్) రద్దు చేయడంతో పాటు మినీ అంగన్‌వాడీల జీవోను తక్షణమే విడుదల చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో బ్లాక్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ బాపట్ల విభాగం నాయకురాలు శైల శ్రీ గురువారం మాట్లాడారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని ఆమె తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దుచేసి.. గ్రాట్యూటీ ఇవ్వాలని కోరారు. సెంటరు నిర్వహణకు ట్యాబ్‌లు సరఫరా చేసి 5జీ నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ మేరకు సీడీపీవో లక్ష్మీపార్వతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీతామహాలక్ష్మీ, హేమమలిని, నన్ని బి, పద్మ, హైమ, నిర్మల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, నాయకులు

చెరుకుపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డుదారులందరికీ 100 రోజులు పని కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఎస్ఆర్పీ వి.కనకారావు పేర్కొన్నారు. ఎస్ఎస్ఏఏటీ డైరెక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో మండల పరిధిలోని గూడవల్లి సచివాలయ పరిధిలో గురువారం సామాజిక తనిఖీ బృందం ఐఈసీ(ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) వారు ఉపాధి శ్రామికులకు ఉపాధి హామీ పథకం హక్కులు, రాజీలేని అంశాలు, ఎంపిక చేసిన పనులు, సామాజిక తనిఖీ గురించి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మరో సీఆర్‌సీ ఎ.విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకెళ్లి వారికి పని కల్పించాలని వివరించారు. అనంతరం గ్రామంలో పీఆర్ఏ మ్యాప్ ద్వారా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నలిగిల నాగేశ్వరరావు, ఎంపీటీసీ గౌరిదేవి ఏసుబాబు, సొసైటీ అధ్యక్షులు ఆలపాటి నరేంద్ర, స్థానిక నాయకులు మల్లాది రామకృష్ణ, గడ్డిపాటి వెంకటేశ్వరరావు, బోగినేని రాజేష్, పంచాయతీ కార్యదర్శి కొండవీటి సురేష్‌బాబు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణానికి చర్యలు



బీసీ కాలనీలో పర్యటిస్తున్న డ్వామా పీడీ శంకర్

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఏళ్ల తరబడి పట్టిపీడిస్తున్న డ్రెయిన్ల సమస్యకు పరిష్కారం చూపుతూ గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు డ్వామా పీడీ శంకర్ పేర్కొన్నారు. గురువారం కొలకలూరు బీసీ కాలనీలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఇటీవల రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ గ్రామంలో పర్యటించి మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గ్రామం మొత్తం పర్యటించి 90శాతం మేర రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కొలకలూరు పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించేందుకు రూ.20 లక్షల అంచనాలతో తొలి విడతగా బీసీ కాలనీలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవిడి.ప్రసాద్, సర్పంచి చొప్పర ప్రీతి, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కఠెవరం జెడ్పీ పాఠశాలకు బెంచీలు వితరణ



బెంచీలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

తెనాలి టౌన్: రూరల్ మండలం కఠెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ తెనాలి బ్యాంకు వారు ఫర్నిచర్ వస్తువులు వితరణగా అందించారు. గురువారం గ్రామంలోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీధర్‌కు ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ శ్రీరంగం శ్రీకాంత్ ఫర్నిచర్ వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఐడీబీఐ బ్యాంకు పాఠశాలకు రూ.లక్ష విలువ చేసే ఫర్నిచర్ వస్తువులు, బీరువాలు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐడీబీఐ పోరంకి బ్యాంకు మేనేజర్ వై.సుజీవ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రజకపేటలోని ఆలపాటి వెంకట్రామయ్య ప్రత్యేక మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌కు మూడు ఆఫీసు టేబుల్స్, రెండు బీరువాలను ఎంఈవో-2 జయంతిబాబు సమక్షంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాదల కోటేశ్వరరావు, కొత్రపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరు శివారులో దారి దోపిడీ

మైనర్‌ను బెదిరించి నగదు దోచుకున్న దుండగులు

తెనాలి రూరల్: తెనాలి మండలం కొలకలూరు శివారులో దారి దోపిడీ ఘటన చోటుచేసుకుంది. చేబ్రోలు మండలం గరువుపాలెంకు చెందిన 16 ఏళ్ల మైనర్ బాలుడు ఆర్థిక ఇబ్బందులతో మంగళగిరిలోని ఓ కాఫీ షాపులో పని చేస్తున్నాడు. ఇంట్లో డబ్బు అవసరం ఉండడంతో గురువారం మధ్యాహ్నం వాహనంపై డబ్బు తీసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. కొలకలూరు శివారు అనుమర్లపూడి వద్ద బాలుడు వెళుతున్న వాహనాన్ని గుర్తుతెలియని ముగ్గురు దుండగులు అడ్డుకున్నారు. వారు బాలుడిని కత్తితో బెదిరించి బాలుడి వద్ద ఉన్న రూ.10 వేలు దోచుకున్నారు. బాలుడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో పాస్టర్ మృతి



తెనాలి అర్బన్: ప్రముఖ దైవ సేవకులు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి పాస్టర్ చిలువూరి సుబ్రహ్మణ్యం (ఏలిషా)(70) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మల్లెపాడు గ్రామంలో రక్షణ కర్త ప్రార్థన మందిరాన్ని ఆయన 30 ఏళ్ల క్రితం స్థాపించి దైవసేవ చేస్తూ వచ్చారు. ఉద్యోగం చేస్తూనే దేవుని సేవ చేశారు. విషయం తెలుసుకున్న తెనాలి పరిధిలోని విశ్వాసులు గురువారం ఆయన నివాసానికి వచ్చి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ఫిరంగిపురం: తమ పంటలకు రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఐ.సునీత అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా వనరుల కేంద్రంలో ప్రధానమంత్రి కృషి వికాస యువజన పథకం కింద రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సునీత మాట్లాడుతూ జీవన ఎరువులయిన అజోస్ స్పిరిల్లం పాస్ఫేట్ బ్యాక్టీరియా పొటాష్ బ్యాక్టీరియా వంటి ద్రవ ఎరువులను వాడుకోవాలని తెలిపారు. యూరియా కొరత లేదని, అధిక ధరలకు యూరియాను దుకాణదారులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో వాసంతి హెచ్చరించారు. అనంతరం ట్రైకోడెర్మావిరిడి మందులు రైతులకు అందజేశారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

నగరం: వినాయక చవితికి ఏర్పాటు చేసే విగ్రహాలకు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్ఐ బండ్ల భార్గవ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రహదారుల వెంట, ప్రధాన కూడళ్లలో విగ్రహాలను ఏర్పాటు చేసేవారు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. విగ్రహాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిమజ్జన సమయంలో ఏర్పాటు చేసే డీజేలకు కూడా అనుమతులు పొందాలన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి: గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్యాంప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండు సార్లు దరఖాస్తులకు ఆహ్వానించామని.. ఇంకా సీట్లు మిగిలి ఉన్నాయని.. దీంతో మూడో సారి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నమని ఆయన అన్నారు. దరఖాస్తులను iti.ap.gov.in వెబ్‌సైట్ నందు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 77024 00570, 93986 50408, 94911 85900 నంబర్లలో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి నమోదు చేసుకోవాలి

చెరుకుపల్లి: రాష్ట్రంలో కౌశలం కోసం అర్హత ఉన్న వారు ఈనెల 31వ తేదీ లోపు సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో షేక్ మహబుబ్ సుభాని తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమో నుంచి పీజీ వరకు ఏ విద్యార్హత కలిగి ఉన్నా 18-35 ఏళ్ల వయస్సు కలిగిన వారు వెంటనే తమ పరిధి సచివాలయాల్లో విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ నంబరు లింక్ కలిగిన మొబైల్ నంబరుతో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వారికి ప్రభుత్వం నుంచి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. కావున ఈ కౌశలం కార్యక్రమంలో ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

వ్యక్తి గల్లంతు

తెనాలి రూరల్: మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి కాలువలోకి దూకి గల్లంతయ్యాడు. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన చావలి ఆర్మ్‌స్టాంగ్(45) భార్య ఏడేళ్ల క్రితం మృతి చెందింది. మానసికంగా కుంగిపోయిన అతను గురువారం స్థానిక పెద్ద కాలువలో దూకి గల్లంతయ్యాడు. గ్రామస్తులు, పోలీసులు అతని ఆచూకీ కోసం గాలించారు. రాత్రి వరకూ గాలించినా అతని ఆచూకీ లభించలేదని తెలిపారు.

సకాలంలో వ్యర్థాలు తొలగించాలి



తెనాలి అర్బన్: పట్టణంలోని వ్యర్థాలను సకాలంలో తొలగించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు ఆదేశించారు. 36వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జన సంచారం ప్రారంభమయ్యే లోపు రోడ్లపై ఉన్న వ్యర్థాలను తొలగించాలని ఆయన తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు హేయం

నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



రేపల్లె: రాజకీయ దురుద్దేశంతో దివ్యాంగుల పింఛన్లను నిలుపుదల చేయడం హేయమైన చర్య అని.. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలను ఆపాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ కోరారు. గుల్లపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి నేతలు నేడు అధికారంలోకి వచ్చాక పింఛనుదారులను ఇబ్బందులు గురిచేస్తూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. ఏ పని చేసుకోలేని దివ్యాంగులపై రాజకీయ కక్ష చూపడం దుర్మార్గమని మండిపడ్డారు. బాపట్ల జిల్లాలో 24,660 పింఛన్లు ఉండగా వారం రోజుల వ్యవధిలోనే 3,829 మంది లబ్ధిదారుల పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడం కుట్రలో భాగమేనన్నారు. సదరం క్యాంపుల పేరుతో దివ్యాంగులను వైద్యశాలల చుట్టూ తిప్పడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాజకీయాలను పక్కనపెట్టి అర్హత దివ్యాంగులకు పింఛన్లు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు.

జాతరను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర

వేమూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు(వేమూరు): చింతమోటు గ్రామంలో అంకమ్మ తల్లి జాతరను అడ్డుకునేందుకు కూటమి నాయకులు కుట్ర చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు పేర్కొన్నారు. చింతమోటు గ్రామంలో ఆదివారం అంకమ్మ తల్లి జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు రెండేళ్లకు ఒకసారి అంకమ్మ తల్లి జాతర చేసుకుంటారని అన్నారు. కూటమి నాయకులు అంకమ్మ తల్లి జాతర సక్రమంగా నిర్వహించకుండా ఉండేందుకు కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పోలీసులు చింతమోటు గ్రామంలో అంకమ్మ తల్లి జాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆయన కోరారు.

యోగాసన పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు కళ్లం హరినాథ్‌రెడ్డి

బాపట్ల టౌన్: జిల్లాస్థాయి యోగాసన పోటీలను యోగాసనాలపై ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు కళ్లం హరినాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని యోగా అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 24న పట్టణంలోని ఏకో హౌస్‌లో జిల్లా యోగాసన ఛాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోటీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే యోగా క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.100 చెల్లించాలన్నారు. క్రీడాకారులకు మధ్యాహ్నం భోజన వసతి ఉంటుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే యోగా క్రీడాకారులకు మెమోంటో, సర్టిఫికెట్ అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొని ప్రతిభ కనబరచాలని ఆయన కోరారు.

భూమి కోతల నివారణకు అంచనాలు సిద్ధం చేస్తాం



తిప్పలకట్ట వద్ద భూమలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు: కృష్ణా వరదల కారణంగా ఏర్పడుతున్న భూముల కోతలను నివారించేందుకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని తిప్పలకట్ట వద్ద వరదల కారణంగా కోతలకు గురవుతున్న పంట భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి కోతల నివారణకు గత వరదలు అనంతరం అంచనాలు రూపొందించినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రసుత్తం వరదల కారణంగా రైతులు విలువైన వాణిజ్య పంటలు నష్టపోవడంతో పాటు, జీవనాధారమైన భూమిని సైతం కోల్పోవడంతో తీవ్ర నష్టానికి గురవుతున్నారన్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన అనంతరం మరోమారు భూమి కోతలు నివారించేందుకు గ్రాయిన్స్ ఏర్పాటుకు అవసరమైన అంచనాలు రూపొందించి సంబంధిత మంత్రి, సీఎం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు వాటిల్లుతున్న నష్టాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మైనేని మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్



ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ ఆనంద్, సిబ్బంది

తెనాలి రూరల్: హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ గురువారం వివరాలను వెల్లడించారు. పాత కక్షల నేపథ్యంలో మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన ఉన్నం విజయబాబు(చిన్నజాన్)పై అదే గ్రామానికి చెందిన సుద్దపల్లి రవీంద్ర మరి కొంతమంది ఈనెల 15న సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కేసును నమోదు చేసిన పోలీసులు సుద్దపల్లి రవీంద్ర, మండలంలోని గుడివాడకు చెందిన చెన్నుబోయిన వెంగళరావు, పినపాటి అనిల్, సుద్దపల్లి రాజేంద్ర, సుద్దపల్లి దీపక్, సుద్దపల్లి కృష్ణలను నిందితులుగా గుర్తించారు. వీరిలో నవీంద్ర, వెంగళరావును పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. హత్యాయత్నం చేసిన ప్రదేశానికి నిందితులను తీసుకువెళ్లి ఆధారాలను సేకరించారు. నిందితులిద్దరినీ కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని, మిగిలిన నలుగురు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర: రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని.. వాతావరణ శాఖ హెచ్చరించిందని.. దీంతో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ గురువారం తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి సుమారు 7 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని లంక గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. వరదలు ఉన్న సమయంలో ఎవరూ చేపల వేటకు, నదీ స్థానాలకు వెళ్లరాదని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొల్లిపర రెవెన్యూ కార్యాలయంలో 24 గంటలూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని.. సహాయ చర్యల కోసం 99085 68006 నంబరును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

విద్యావిధానంలోని మార్పులను అందిపుచ్చుకోవాలి



తెనాలి అర్బన్: విద్యావిధానంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ శాంత పేర్కొన్నారు. ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో ఆమె పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన కోర్సులు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ గురించి విద్యార్థినీలకు వివరించారు. ఈనెల 28వ తేదీ వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోజలిన్, అధ్యాపకులు సీఎం అనిత, డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.